**అవినీతిపై అక్షర సమరం**

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక







ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 15 | శుక్రవారం 14 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి

- యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా
- తిరుపతిలో అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం: సీఎం చంద్రబాబు
- 'ఏపీ ఫస్ట్'... తిరుపతిలో అతి పెద్ద రీసెర్చ్ సెంటర్
- తిరుపతిలో 'ఏపీ ఫస్ట్' పేరుతో భారీ పరిశోధన కేంద్రం
- ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో యువతకు నైపుణ్యం అందించడమే లక్ష్యం
- రాష్ట్రంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశం
- వ్యవసాయం, వైద్యంలో డ్రోన్ల వినియోగం పెంచాలని సూచన





**అమరావతి**

యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా, వారికి అన్ని విధాలా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు.. ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు. తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో - మిగతా3లో

# స్పీకర్‌పై సుప్రీం గరం గరం

- స్పీకర్‌కు ఇదే చివరి అవకాశం..
- ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం
- అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలి



**న్యూఢిల్లీ**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యే ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్కు సమయం ఇచ్చినా, ఇంకా పూర్తి నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇవాళ విచారణ చేపట్టిన ధర్మాసనం అసెంబ్లీ స్పీకర్‌కు మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని, ఇది చివరి అవకాశమని పేర్కొంది. ఇకపై నిర్ణయం తీసుకోకుంటే తీవ్రంగా వ్యవహరించాల్సి వస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా వింటర్ వెకేషన్ తరువాత తొలిసారి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం విచారణ చేపట్టింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం ఈ కేసును విచారించింది. మరోవైపు 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ఏడుగురిపై - మిగతా3లో

# 18న ఖమ్మం బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

- వాడవాడలా భాగస్వాములు కావాలి
- -సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ
- ఇంటికొకరు పార్టీ శ్రేణులు నూతనుత్తేజంతో కదలిరావాలి
- కోటి మందికి చేరేలా శతాబ్ది ఉత్సవాల ప్రచారం
- -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య




**అంకుశం ప్రతినిధి విజయవాడ జనవరి 16**

ఖమ్మంలో ఈనెల 18వ తేదీన జరగనున్న సీపీఐ శతాబ్ది వార్షికోత్సవ భారీ బహిరంగ సభ, ప్రదర్శన ఒక చారిత్రాత్మకంగా నిలవనుందని, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా తరలిరావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జూమ్ ద్వారా జరిగింది. విజయవాడ చంద్రం బిల్డింగ్స్ నుంచి సీపీఐ - మిగతా2లో

# కాకినాడలో ఏఎమ్ గ్రీన్ భారీ ప్రాజెక్ట్

- కాకినాడలో 'ఏఎమ్ గ్రీన్' రూ.90 వేల కోట్ల పెట్టుబడి...
- మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా టెర్మినల్
- 8,000కు పైగా ఉద్యోగ అవకాశాలు
- జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు గ్రీన్ ఎనర్జీ ఎగుమతి
- ప్రపంచ గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కీలక స్థానం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడి రాబోతోంది. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ (ూవీ +తీవవఅ) సంస్థ ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 90,000 కోట్లు) పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ఎగుమతి టెర్మినల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 8,000 మందికి పైగా నాణ్యమైన ఉద్యోగాలు లభించనున్నాయని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఏఎమ్ గ్రీన్ ఏర్పాటు చేయనున్న ఈ టెర్మినల్ ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇక్కడ తయారైన గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, సింగపూర్, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన - మిగతా3లో

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో - మిగతా3లో

# ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హరిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఒక చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే భారీ పరిశ్రమకు కాకినాడ వేదిక కాబోతోంది. రేపు (జనవరి 17) ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థ సుమారు రూ.13 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏడాది క్రితమే ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా, - మిగతా3లో


# 18నఖమ్మం బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చెయిర్మన్ జల్లి విల్సన్, వివిధ జిల్లాల నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ, ఖమ్మం బహిరంగ సభకు ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. రాయలసీమ వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు రైళ్లు ఏర్పాట్లు చేసిన అక్కడి జిల్లా నాయకత్వం పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మన పార్టీ శతాబ్ధి ఉత్సవాల్లో పాల్గొనడం ఒక అదృష్టమని, మళ్లీ అలాంటి రోజు తిరిగి రాబోదన్నారు. ఈ జీవితాంతం గుర్తుండే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గతంలో ఏపీ కేంద్రంగా జరిగిన పార్టీ జాతీయ సభలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఖమ్మం బహిరంగ సభ ప్రాంగణానికి, ప్రదర్శనకు సకాలంలో ప్రజలు చేరుకోవాలని కోరారు. రైళ్ల ద్వారా వచ్చే ఆయా జిల్లాల నాయకులంతా ఖమ్మం జిల్లాలోని నయాబజార్ కళాశాల, శ్రీశ్రీ విగ్రహం, పెవిలియన్ గ్రౌండ్ (జనసేవాదళ్ వలంటీర్లు) నుంచి జరగబోయే ప్రదర్శనలకు మన నాయకత్వం బాధ్యత వహించాలని సూచించారు. ఖమ్మంలో 18న జరిగే ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతానికి సమన్వయంగా కృషి చేయాలని కోరారు.

బహిరంగ సభ అనంతరం, 19న పార్టీ జాతీయ కౌన్సిల్ జరుగుతుందన్నారు. 20న జరిగే పార్టీ జాతీయ సెమినార్‌లోను మన రాష్ట్ర నాయకత్వం, జిల్లా కార్యదర్శులు పాల్గొనాలని కోరారు. తప్పకుండా పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో ఖమ్మం సభ విజయవంతం అయ్యేంత వరకు శ్రమించాలని కోరారు.

ఈశ్వరయ్య మాట్లాడుతూ, తొలుత పార్టీ జాతీయ కార్యదర్శి



కె.రామకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభకు, ప్రదర్శనకు ఒక నూతనుత్తేజంతో ఇంటికొకరు చొప్పున పార్టీ శ్రేణులు హాజరు తరలి రావాలన్నారు. వందేళ్ల చరిత్ర గలిగిన కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి మరింత స్ఫూర్తినిచ్చేలా రాష్ట్రం నలుమూలల నుంచి కదంతొక్కాలని కోరారు. మన పార్టీ శతాబ్ధి ఉత్సవాల సభకు రైళ్లు, బస్సులు, వాహనాల ద్వారా తరలివెళ్తూనే, మరోవైపు సోషల్ మీడియా( ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్) వేదికగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చలో ఖమ్మం పేరుతో రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, కడప, ఏలూరులో కళాజాతా ప్రదర్శనల ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రంలోని పార్వతీపురం, అల్లూరి, విజయనగరం, అనకాపల్లి తదితర జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చేందుకు సమీకరణ జరిగిందన్నారు. రాజమండ్రి, కాకినాడ నుంచి బస్సుల ద్వారా వచ్చేందుకుగాను ఆయా జిల్లా నాయకత్వం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఏలూరు జిల్లా నుంచి దాదాపు 3వేల మంది సమీకరణతో భారీగా ఖమ్మం సభకు హాజరుకానున్నారని వివరించారు..

# డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు.

శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్



రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు.

**డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి**

ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు. "డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్' వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోట్ల రూపాయిల్లో పందేలు...

**ఏలూరు :** సంక్రాంతి పండగ రెండు రోజుల్లోనే బరుల్లో కోడి పందేలు జోరుగా జరిగాయి. కోడిపందేల్లో వందల కోట్లు చేతులు మారినట్లు సమాచారం. పెద్దయెత్తున భారీగా పందేలు కాయడంతో రెండు రోజుల్లోనూ వంద కోట్ల మేర బెట్టింగ్ లు జరిగాయని సమాచారం. రేపు కనుమ కావడంతో మరింతగా పందెంరాయుళ్లు రెచ్చిపోతారన్న అంచనాలు వినిపిస్తున్నాయి. క్రికెట్ గ్రౌండ్స్ ను మరిపించేలా కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలను సమకూర్చడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కోడి పందేలను వీక్షించేందుకు పెద్దయెత్తున జనం తరలి వచ్చారు. పోలీసుల ఆంక్షలు ఏమాత్రం పనిచేయలేదు. యథేచ్ఛగా పందేలు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఒక్క ఉభయ గోదావరి జిల్లాల్లోనే రెండు వందలకు పైగానే బరులున్నాయి.ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ బరులు ఎక్కువగా ఈ ఏడాది ఏర్పాటు చేశారు. అయితే ఈసారి వరసగా నాలుగుసార్లు కోడిపందేల్లో నెగ్గిన కోడి యజమానికి బుల్లెట్ బండి బహుమతిగా ఇస్తున్నారు. ఫైనల్ విజేతకు ఇన్నోవా కారును బహుమతిగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. బరుల వద్దనే ఇన్నోవా కారును కూడా ఉంచి మొదటి బహుమతి గెలిచిన కోడి యజమానికి అందచేస్తామని ప్రకటించారు. చాలా బరుల్లో పాస్ లు ఉన్న వారికి మాత్రమే గ్యాలరీలోకి అనుమతి ఇస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత జోరుగా కోడి పందేలు జరుగుతున్నాయని చెబుతున్నార. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో జనం ఇక్కడకు క్యూకట్టారు. ఇతర జిల్లాలకుచెందిన వారు కూడా ఇక్కడకు తరలి వచ్చారు.బరులవద్దనే మంచి భోజనాన్నిఅందిస్తున్నారు. కోడికూర, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, చేపల పులుసు తో పాటు గోదావరి జిల్లాలకు చెందిన రుచులన్నీఅక్కడకు వచ్చిన వారికి అందిస్తున్నారు. ఇక మద్యం కూడా అక్కడే అందుబాటులో ఉంది. కాస్ట్ లీ మద్యం నుంచి నాసిరకం సరుకు వరకూ లభ్యమవుతుంది.ఖరీదైన కార్లు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కనిపిస్తున్నాయి. ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ అత్యంత ఖరీదైన కార్లు కూడా బరుల వద్ద కనిపిస్తున్నాయి. అంతా క్యాష్ తోనే పందేలు కాస్తున్నారు. కొన్ని చోట్ల గూగుల్, పేటీఎం ద్వారా పే చేసే సౌకర్యం కల్పించినా ఎక్కువ మంది కరెన్సీ కట్టలనే తీసుకు వచ్చి పందేలు కాస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో జరిగిన ఒక బరిలో ఒక్క పందెంలో దాదాపు కోట్ల రూపాయలుచేతులు మారినట్లు తెలిసింది. కరెన్సీని లెక్కపెట్టేందుకు అక్కడకు మనీ కౌంటింగ్ మిషన్లు కూడా తెచ్చారు.

**యుద్ధానికి ఆజ్యంపోసిన కోడి పందేలు**

కేవలం గెలుపోటములే కాకుండా, పందెంలో గెలిచిన వారికి ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను బహుమతిగా ప్రకటించారు. దాంతో ఈ పోటీపై రాష్ట్రంలో అందరి దృష్టి నెలకొంది. రావులపాలెంలో ఏర్పాటు చేసిన ఈ బరిలో పోరు సాగింది. నిర్వాహకులు మొత్తం ఏడు పందేలను నిర్వహించగా, అందులో 5 పందేలు ఎవరు గెలిస్తే వారికి బుల్లెట్ బైక్ ఇస్తామని ప్రకటించారు. ఒక వర్గం అసాధారణ ప్రతిభను కనబరిచి 7 పోటీలకు గాను 6 పందేలలో విజయం సాధించి ఖరీదైన బుల్లెట్ బైక్‌ను సొంతం చేసుకుంది.విజేతగా నిలిచిన గ్రూప్ వారికి డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలుకూరి సతీష్ చేతుల మీదుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్ అందజేశారు. పందెం కోళ్ల పోరాటం చూసి, ఈవెంట్ హాజరైన వారు ఆశ్చర్యపోయారు. కోడి పందేలలో భూములు, ఏళ్ల తరబడిగా సంపాదించిన ఆస్తులు కోల్పోయిన వాళ్లు సైతం ఉంటారు.సంక్రాంతి పండుగ వేళ కోడి పందేల జోరు కనిపిస్తుంటుంది. అయితే, చరిత్రను గమనిస్తే వీటి కారణంగా యుద్ధాలు సైతం జరిగాయని తెలుస్తోంది. అందుకు ఉదహరణే మాచర్ల, గురజాల మధ్య జరిగిన పోరు. ఏపీలో ఎంతో ముఖ్యమైన పల్నాటి యుద్ధం ప్రారంభం కావడానికి కోడిపందెమే ప్రధాన కారణం అని తెలిసిన వారు ఆశ్చర్యపోతున్నారు. పల్నాటి చరిత్రలో మాచర్ల పాలకులకు బ్రహ్మనాయుడు, గురజాల పాలకులకు నాగమ్మ మంత్రులుగా ఉండేవారు. అయితే ఓ సందర్భంలో వీరు సరదాగా కోడి పందేలు వేసుకున్నారు. కొన్ని విభేదాలను పరిష్కరించేందుకు కోడి పందేలు నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు.

## కాకినాడలో ఏఎమ్ గ్రీన్ భారీ ప్రాజెక్ట్

-మొదటిపేజీ తరువాయి

విద్యుత్‌ను దాదాపు 7.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం, 1 గిగావాట్ పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ద్వారా సమకూర్చనున్నారు. అమ్మోనియా రూపంలో గ్రీన్ ఎనర్జీని విదేశాలకు ఎగుమతి చేయడం భారతదేశ చరిత్రలోనే ఇది తొలిసారని లోకేశ్ పేర్కొన్నారు. ఈ భారీ పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ గ్రీన్ ఎనర్జీ వ్యాల్యూ చెయిన్‌లో అగ్రగామిగా నిలవనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతాన్ని ఇవ్వడమే కాకుండా, హరిత ఇంధన రంగంలో ఏపీకి కీలక స్థానాన్ని కట్టబెట్టనుందని తెలిపారు.

## ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు...

-మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుంది.

**ప్లాంట్ విశేషాలు.. వేల ఉద్యోగాలు**

గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత టెక్నాలజీతో పనిచేసే ఈ ప్లాంట్ ద్వారా ఏటా 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడలో సుమారు 495 ఎకరాల విస్తీర్ణంలో, గతంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ ఉన్న ప్రదేశంలో ఈ కొత్త ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 2027 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు చేపట్టనున్నారు. శనివారం ఉదయం 10:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి, 11:20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, అనంతరం ప్రసంగిస్తారు.

**పర్యావరణ హితం.. ప్రపంచానికి ఎగుమతులు**

బొగ్గు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలతో తయారు చేసే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా, ఈ గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో ఎలాంటి కర్బన ఉద్గారాలు వెలువడవు. పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా తయారయ్యే ఈ ఇంధనం పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించదు. ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా పెట్టుకున్న ప్రస్తుత తరుణంలో, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాకినాడ పోర్టుకు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఈ ప్లాంట్ ఉండటం వల్ల, ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమోనియాను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు అద్భుతమైన అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఏఎమ్ గ్రీన్ సంస్థ జర్మనీకి చెందిన యూనిపర్ ఎస్ఈతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుతో పాటే, కాకినాడలోనే సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో 2 గిగావాట్ల సామర్థ్యం గల ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను కూడా ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్ జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు.. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ హరిత ఇంధన పటంలో కీలక స్థానంలో నిలపనుంది.

## గిరిజన గ్రామం అణుకులో హోంమంత్రి

-మొదటిపేజీ తరువాయి

కోల్పోయినట్లు గిరిజనులు గుర్తుచేశారు. ఇప్పుడు రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రి అనితకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**పేరుపేరునా పలకరిస్తూ..**

గ్రామంలోని పరిదేశమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి అనిత దర్శించుకున్నారు. గిరిజనులతో ముఖాముఖి సంభాషణ జరిపి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అక్కడి ప్రజలను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు అడిగారు. చిన్నారులతో ఆడుకుని.. వారికి పుస్తకాలు, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. గిరిజనులకు స్వయంగా భోజనాలు వడ్డించి, తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు అనిత. మంత్రి కుమారుడు నిఖిల్.. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. మంత్రి అనిత, కుమారుడు నిఖిల్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆ గ్రామ యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం.. చిన్నారుల డ్యాన్స్‌ను అభినందించారు. గిరిజనులు పండించిన కూరగాయలు, పంటలను మంత్రికి అణుకు ప్రజలు బహూకరించారు.

**సంతోషంగా ఉండాలి: హోంమంత్రి**

గ్రామస్థులతో మాట్లాడిన మంత్రి అనిత మాట్లాడుతూ.. 'మీతో ప్రశాంతంగా పండుగ చేసుకోవాలని ఇక్కడకు వచ్చాను. మీ అందరితో కలిసి పండుగ చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతం. నా పిల్లలను కూడా తీసుకువచ్చాను. మీ గ్రామానికి ఏమి కావాలో అన్నీ చేస్తాను. రూ. 2.50 కోట్లతో రోడ్డు మంజూరైంది. సంబంధిత ఆర్డర్ కాపీతోనే వచ్చాను. మీరంతా సంతోషంగా ఉండాలి. పిల్లలు చక్కగా చదువుకోవాలి. మంచి ఉద్యోగాలు చేయాలి' అని హోంమంత్రి చెప్పారు.

**అధికారులకు ఆదేశాలు..**

2014 నుంచి 2019 వరకు ఈ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రేషన్ డిపో ఏర్పాటు చేస్తున్నామని అనిత అన్నారు. త్వరలో సెల్ టవర్ స్థాపన చేస్తామని తెలిపారు. గ్రామంలో 20 మంది పిల్లలు ఇంటర్, డిగ్రీ వరకు చదివారన్న ఆమె.. ఇద్దరు ఆడపిల్లలు డిగ్రీ చదువుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. అణుకు గ్రామంలో ఒక్కో ఇంటికి ఒక బాత్‌రూమ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారామె.

## పదవీ గండం

## తెరపైకి కొత్త నేతలు



**నెల్లూరు :** కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్ల సమయం దగ్గరపడుతున్న కొద్దీ కొందరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఇద్దరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా కనపడుతుంది. ఇద్దరు మంత్రులు ఇప్పుడు ఏ విషయంలోనూ వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటి వరకూ కొంత మౌనంగా ఉన్నప్పటికీ త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో తమ పదవికి గండం ఏర్పడుతుందనుకున్నారో.. ఏమో..ఈ ఇద్దరు మాత్రం తరచూ మీడియాలో కనిపిస్తున్నారు. ప్రధానంగా విపక్ష నేత వైఎస్ జగన్ పై విమర్శలు చేయడంలో వీరిద్దరూ ముందుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ వంగలపూడి అనిత లేకుంటే.. నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు వంటి వారు మాత్రమే ఎక్కువ విమర్శలు చేసేవారు. ఇక నారాయణ సరేసరి.తాజాగా ఈ జాబితాలోకి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత చేరిపోయారు. ఏవిషయంలోనూ వీరు వెనక్కు తగ్గకుండా తాము జగన్ ను విమర్శించడంలో ముందున్నామని చెప్పకనే చెబుతున్నారు. ఆనం రామనారాయణరెడ్డి దేవదాయ శాఖ కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ ఆయన శాఖపై మాత్రమే స్పందించేవారు. కానీ మంత్రివర్గ విస్తరణలో ఆనం ను తప్పించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కానీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మరొకవైపు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి ఆనంను తప్పించి వీరిలో ఒకరికి చంద్రబాబు కేబినెట్ లో స్థానం కల్పించే ఛాన్స్ ఉందన్న ప్రచారం తో ఆనం అలెర్ట్ అయినట్లు కనపడుతుందిఇక మరొక మంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సవిత కూడా ఈ మధ్య కాలంలో యాక్టివ్ గా ఉన్నారు. సవిత నిన్న మొన్నటి వరకూ పెద్దగా మీడియాలోకనిపించలేదు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత పదవికి గండం పొంచి ఉందని ప్రచారం జరుగుతుంది. అనంతపురం జిల్లాలో సీనియర్ నేతలున్నప్పటికీ వారిని కాదని కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సవితకు తొలిదఫా లో మంత్రి పదవి లభించింది. అయితే ఆమె కొన్ని వివాదాలకు కూడా కారణమయ్యారు. సవిత పనితీరుపై పార్టీ నాయకత్వం కూడా గత కొంత కాలంగా సంతృప్తి కరంగా లేకపోవడంతో ఆమెను కేబినెట్ నుంచి విస్తరణలో తప్పిస్తారని అంటున్నారు. సవిత స్థానంలో కాల్వ శ్రీనివాసులు పేరు వినిపిస్తుంది. పయ్యావుల కేశవ్ ను అలాగే ఉంచి సవితను తప్పిస్తారన్న ప్రచారం పెద్దయెత్తున జరుగుతుండటంతో ఆఆమె కూడా ఇటీవల కాలంలో యాక్టివ్ అయ్యారు. మరి చివరకు చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

# యువత క్రీడా సంస్కృతిని పెంపొందించాలి

## – విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన రిటైర్డ్ డిఎస్పీ అశోక్ కుమార్ గౌడ్

**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి విజయవాడ జనవరి 16 :** విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలోని పోలవరం కుడి ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న ఈవీఈ గ్రౌండ్స్‌లో ఈడా వేదాద్రి ఇంజనీర్స్ (ఈవీఈ) ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహించిన మూడు రోజుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ గురువారం రాత్రి ఉత్సాహంగా ముగిసింది. సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో విజయవాడ రూరల్, జి కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మరియు విజయవాడ నగరం అంతటా బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్పీ) ఈవ్ అశోక్ కుమార్ గౌడ్ ముగింపు వేడుకకు హాజరై విజేతలు, రన్నరప్‌లకు బహుమతులు అందజేశారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఇటీవలి సంవత్సరాలలో ప్రభుత్వ సేవల్లో స్పోర్ట్స్ కోటా కింద ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయని హైలైట్ చేస్తూ, యువత క్రీడలను చురుకుగా చేపట్టాలని ప్రోత్సహించారు. క్రమశిక్షణ, జట్టుకృషి మరియు నిజమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినందుకు పాల్గొన్న వారందరినీ ఆయన అభినందించారు. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పలగాని సీతారామయ్య గత 13 సంవత్సరాలుగా దాని అధ్యక్షురాలు ఎడా వేదాద్రి నాయకత్వంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిరంతరం నిర్వహిస్తున్నందుకు ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్‌ను ప్రశంసించారు. సంక్రాంతి పండుగల సమయంలో, చాలా మంది యువత కోడి పందాలు, కార్డ్ గేమ్స్ మరియు జూదం వైపు ఆకర్షితులవుతారు, అయితే ఇటువంటి క్రీడలు



ఆరోగ్యకరమైన మరియు నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని హెల్ప్ హాస్పిటల్ సిఇఒ చలపాటి జయంత్ పండుగ సీజన్‌లో టోర్నమెంట్ నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు, క్రీడా కార్యకలాపాలు యువతను జూదం మరియు కోడి పందాల నుండి మళ్లించడానికి సహాయపడతాయని పేర్కొన్నారు. ఇలాంటి అభిప్రాయాలను ప్రతిధ్వనిస్తూ, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మరిదు శివరామ కృష్ణ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు మరియు ఫిట్‌నెస్ మరియు ఆరోగ్యకరమైన వినోదాన్ని ప్రోత్సహించినందుకు నిర్వాహక కమిటీని అభినందించారు. ఈవీ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు ఎడా వేదాద్రి, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పలగాని రాజేశ్వరరావు మరియు అంకెం వెంకట విష్ణు చైతన్య, ఈవీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు హాజరయ్యారు.

డబుల్స్ టైటిల్ విన్నర్స్ సాదిక్, హమీద్ జోడీ సీనియర్స్ విభాగంలో, విజయవాడకు చెందిన సాదిక్ మరియు హమీద్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, విజయవాడకు చెందిన కాసీమ్ మరియు సాయి రన్నరప్ స్థానాన్ని దక్కించుకున్నారు. జూనియర్స్ విభాగంలో కొండూరుకు చెందిన అభి మరియు శంకర్ టైటిల్‌ను కైవసం చేసుకోగా, మైలవరానికి చెందిన పవన్ మరియు అభి రన్నరప్‌గా నిలిచారు. సబ్-జూనియర్ విభాగంలో మైలవరానికి చెందిన వరుణ్ మరియు ప్రవీణ్ విజేతలుగా నిలవగా, వెలగలేరుకు చెందిన సూర్య మరియు కుశేల్ రన్నరప్‌గా నిలిచారు.

# సంప్రదాయాలే సమాజ బలానికి మూలం







### – మంత్రి సత్య కుమార్ యాదవ్
### – నేటి తరానికి సంప్రదాయ ఆటలు పరిచయం చేయాల్సిన అవసరం ఉంది

**అంకుశం న్యూస్ ధర్మవరం, జనవరి 16:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సంప్రదాయ క్రీడల కార్యక్రమం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరై, ప్రజలతో కలిసి సంప్రదాయ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి స్వయంగా బొంగరాలు, గోలీలాట, కర్రా బిల్లా, తాడు లాగుట, పతంగుల పండుగ వంటి సంప్రదాయ గ్రామీణ క్రీడలను ప్రదర్శించి, చిన్నపిల్లలు, యువతతో కలిసి ఆడుతూ అందరినీ ఉత్సాహపరిచారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయ ఆటలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం మంత్రి, పురుషుల కబడ్డీ పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కబడ్డీ పోటీలలో మొత్తం 16 జట్లు పాల్గొనగా, ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో తాడిపత్రి కబడ్డీ జట్టు మరియు అనంతపురం కబడ్డీ జట్టు పరస్పరం తలపడ్డాయి. ఈ పోటీలో అద్భుతమైన ప్రదర్శనతో అనంతపురం కబడ్డీ జట్టు విజేతగా, తాడిపత్రి కబడ్డీ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేతగా నిలిచిన అనంతపురం కబడ్డీ జట్టుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ మోమెంటోతో పాటు ₹25,000 నగదు బహుమతిని, రన్నరప్‌గా నిలిచిన తాడిపత్రి కబడ్డీ జట్టుకు మోమెంటోతో పాటు ₹15,000 నగదు బహుమతిని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూడ సంక్రాంతి పండుగ అనేది మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు., పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

# సంక్రాంతి సంబరాలు ప్రజలకు మరపురాని అనుభూతి

### – ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి
### – సుగాలి నృత్యంలో కాలు కదిపిన ఎంపీ కేశినేని శివనాథ్
### కర్ర సాముతో ఆకట్టుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**అంకుశం ప్రతినిధి విజయవాడ జనవరి 16:** ఈ సంక్రాంతికి ఎన్టీఆర్ జిల్లా మొత్తం పండుగ వాతావరణంతో వైబ్రెంట్ గా కనిపిస్తోంది. తెలంగాణ నుంచి కూడా తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలకు ప్రజలు వచ్చి సంబరాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య నాయకత్వంలో జగ్గయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా సాగాయి.
జగ్గయ్యపేట పట్టణంలోని ముత్యాల రోడ్డు పాతపేట గడ్డ నందు నిర్వహించిన ఈ సంక్రాంతి సంబరాల్లో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం , మాదిగ కార్పోరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి , రాష్ట్ర కార్య నిర్వాహ కార్యదర్శి జంపాల సీతారామయ్య , జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర , జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ లతో కలిసి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు.





ఈ సంబరాల్లో పిల్లల సాంస్కృతి నృత్యాలు , లంబాడ సుగాలి డాన్స్ , చిన్నారుల కర్ర సాము, కోలాటం, గంగిరెద్దుల విన్యాసాలు ప్రజలను అలరించాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ చేసిన కర్రసాము ప్రజలతో చప్పట్లు కొట్టించింది . అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ లంబాడీలతో కలిసి నృత్యం చేశారు. ఇక జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా ఇంటి వద్ద సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజానీకానికి ఏర్పాటుచేసిన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సంక్రాంతి అనేది బంధు మిత్రులతో కలిసి జరుపుకునే సంప్రదాయ పండుగ అని, ఎక్కడున్నా స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడం సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన సంక్రాంతి పండుగ ప్రత్యేకత అని అన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, వ్యాపారాల ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం అందిస్తూ ఉద్యోగ కల్పనలో ముందుంటుందని ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ఆర్యవైశ్యుల అవగాహన, సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక ఆలయాల వద్ద ఆర్యవైశ్యులు నిర్మించిన సత్రాలు కనిపిస్తాయని, అహింస పద్ధతిలో జీవనం సాగించే వర్గమని కొనియాడారు.
కులమతాలకు అతీతంగా ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించటం ఆనందకరమని, జగ్గయ్యపేటలో జరిగే సంక్రాంతి వేడుకలకు ప్రతి ఏడాది హాజరవుతానని ఎంపీ హామీ ఇచ్చారు. . ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖలో విభిన్న వాతావరణం...

**విశాఖపట్టణం :** అతి పెద్ద పండుగైన సంక్రాంతి సంబరాలకు సిద్ధమవుతున్న వేళ వాతావరణం ఏపీ ప్రజలను కలవరపెడుతోంది. రాష్ట్రం ప్రస్తుతం విచిత్రమైన వాతావరణ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు బంగాళాఖాతాంలో పొంచి ఉన్న తుపాను ముప్పు కోస్తా తీరాన్ని భయపెడుతుంటే, మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు గజగజ వణికిస్తున్నాయి. ఈ డబుల్ ఎఫెక్ట్ ప్రజలకు సవాల్‌గా మారింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఇప్పుడు తీవ్ర రూపం దాలుస్తోంది. వాతావరణ శాఖ తాజా నివేదికల ప్రకారం, ఈ వాయుగుండం బలపడుతూ తుపానుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వాయుగుండం పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ శ్రీలంక వైపు ప్రయాణిస్తోంది. శుక్రవారం సాయంత్రం నాటికి ఇది శ్రీలంకలోని హంబన్‌తోట, బట్టికోల మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీరంపై ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే ఇది తుపానుగా మారిన పక్షంలో గాలుల వేగం గంటకు 60 నుంచి 100 కిలోమీటర్ల వరకు పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఉత్తర ఆంధ్ర, ఒడిశా, తమిళనాడు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లకూడదని, తీరని ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సంక్రాంతి సమయంలో తుపానులు రావడం కొత్తేమీ కాదని వాతావరణ రికార్డులు చెబుతున్నాయి. 1891 నుంచి 2024 మధ్య కాలంలో సంక్రాంతి పండుగ సమయంలో సుమారు 12 సార్లు తుపానులు ఏర్పడినట్టు ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే తరహా వాతావరణ పరిస్థితులు కనిపిస్తుండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను ముమ్మరం చేశారు. పండుగ పూట వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. తుపాను గండం ఒకవైపు ఉంటే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి తీవ్రత పరాకాష్టకు చేరింది. మన్యం ప్రాంతం మంచు దుప్పటిని కప్పుకుంది. ముఖ్యంగా పాడేరులో గురువారం ఉదయం కేవలం 4.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే చాలా తక్కువ. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రాంతంలోని ఇతర జిల్లాల్లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. ఉదయం పది గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో గిరిజన ప్రాంతాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు.

## వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఘనంగా గో పూజ

**అంకుశం న్యూస్ తిరుపతి జనవరి 16:** తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో శుక్రవారం కనుమ పండుగ సందర్భంగా గో మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు జి.భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.



ఇందులో భాగంగా గోశాలలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గౌరిపూజ, తులసిపూజ చేశారు. అటుతర్వాత గజరాజు, అశ్వాలు, వృషభాలు, గోవులకు పూజలు చేసి కర్పూర హారతులు సమర్పించి, వాటికి దానా అందించారు. ఈ సందర్భంగా దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలు నిర్వహించారు. గోశాల ఇంచార్జి సంచాలకులు డాక్టర్ శివ కుమార్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## సంక్రాంతి స్వీట్స్ పండ్లు పంపిణీ చేసిన వేముల వెంకటరామిరెడ్డి

**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 16:** ధర్మవరం లో మూడు రోజుల పాటు ఘనంగా సంక్రాంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ధర్మవరం శివానగర్ కు చెందిన వేముల వెంకటరామిరెడ్డి శ్రీ మతి భాగ్య లక్ష్మి దంపతులు తమ కుమారుడు వేముల చక్రధర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆశ్రమం లోని వారికి సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు.



## సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన మంత్రి సత్య కుమార్ కు బీసీ సంఘం నేత జయశ్రీ అభినందనలు!

**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 16:** ధర్మవరం లో సంక్రాంతి సంబరాలు ఘనంగామూడు రోజుల పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ దంపతులు ఘనంగా నిర్వహించడం గొప్ప విషయం అంటూ రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు శ్రీ మతి సంకారపు జయశ్రీ మంత్రి సత్య కుమార్ దంపతులకు అభినందనలు తెలియజేసారు. సంక్రాంతి కనుమ పండుగ ల శుభాకాంక్షలు తెలిపారు.



## అయోధ్య నుండి పూరి.. ఐఆర్సీటీసీ గోల్డెన్ ఆఫర్

**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తరచూ సరికొత్త ప్యాకేజీలను ప్రకటిస్తూ ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా 'భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు' ద్వారా ఒక ఆధ్యాత్మిక యాత్రను ప్రకటిచింది. తొమ్మిది రాత్రులు, 10 పగటి రోజులు సాగే ఈ సుదీర్ఘ యాత్ర ఫిబ్రవరి 5వ తేదీన ప్రారంభమై, ఫిబ్రవరి 14వ తేదీతో ముగుస్తుంది. ఈ యాత్ర చేయాలనుకునేవారు గయ, పూరి జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, కోల్‌కతా, గంగాసాగర్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు.ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఆగ్రా కాంట్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరుతుంది. ప్రయాణికులు ఈ పర్యటనలో గయలోని విష్ణుపాద ఆలయం, పూరిలోని జగన్నాథ స్వామి ఆలయం, కోణార్క్‌లోని సూర్య దేవాలయం, కోల్‌కతాలోని గంగాసాగర్, జసిదిహ్‌లోని బైద్యనాథ్ ధామ్, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి, హనుమాన్ గర్హి తదిరత పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవచ్చు. ఈ రైలులో మొత్తం 767 సీట్లు అందుబాటులో ఉన్నాయి వీటిలో 2 ఏసీ విభాగంలో 49, 3 ఏసీ విభాగంలో 70, స్లీపర్ క్లాస్‌లో 648 సీట్లు ఉన్నాయి. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా ప్రయాణికులకు సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ లేదా స్లీపర్ క్లాస్ ప్రయాణ సౌకర్యంతో పాటు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో శాకాహార భోజనం అందిస్తారు. అలాగే స్థానిక ప్రాంతాల సందర్శన కోసం ఏసీ లేదా నాన్-ఏసీ బస్సుల సౌకర్యం ఉంటుంది. ధరల విషయానికి వస్తే ఎకానమీ (స్లీపర్) క్లాస్‌కు ఒక్కొక్కరికి రూ. 19,110, స్టాండర్డ్ (థర్డ్ ఏసీ) క్లాస్‌కు రూ. 31,720, కంఫర్ట్ (సెకండ్ ఏసీ) క్లాస్‌కు ₹41,980 గా నిర్ణయించారు. ఐదేళ్ల నుండి 11 ఏళ్ల లోపు పిల్లలకు స్వల్ప రాయితీతో కూడిన ధరలు వర్తిస్తాయి. ఈ ఆధ్యాత్మిక యాత్రను బుక్ చేసుకోవాలనుకునే భక్తులు ఐఆర్సీటీసీ అధికారిక వెబ్‌సైట్ ఀఀఀ.ఈతీఛిఛిశీబతీఱంఎ.ఛిశీఎ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. ప్రయాణికుల ఆర్థిక వెసులుబాటు కోసం ఈ ప్యాకేజీని ఈఎంఐ (ఈఎంఐ) పద్ధతిలో కూడా పొందే అవకాశం కల్పించారు. ఐఆర్సీటీసీ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా సులభ వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించే వెసులుబాటు ఉంది. తక్కువ ఖర్చుతో దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని ఐఆర్‌సీటీసీ తెలిపింది.

## డ్యూటీ ఎక్కేందుకు ససేమిరా అన్న ఇండిగో పైలట్

ముంబై నుంచి థాయ్‌లాండ్‌లోని క్రాబీకి వెళ్లాల్సిన ఇండిగో విమానంలో గురువారం తీవ్ర గందరగోళం నెలకొంది. తన డ్యూటీ సమయం ముగిసిపోవడంతో విమానాన్ని నడిపేందుకు పైలట్ నిరాకరించడమే ఇందుకు కారణం. దీంతో గంటల తరబడి విమానం కదలకపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే, ఇండిగో ఫ్లైట్ 6జు 1085 గురువారం ఉదయం 4:05 గంటలకు ముంబై నుంచి బయలుదేరాల్సి ఉంది. అయితే, మరో విమానం ఆలస్యంగా రావడం, ఎయిర్ ట్రాఫిక్ రద్దీ వంటి కారణాలతో ఇది ఇప్పటికే మూడు గంటలకు పైగా ఆలస్యమైంది. ప్రయాణికులను విమానంలోకి ఎక్కించిన తర్వాత కూడా టేకాఫ్ కాకపోవడంతో వారి సహనం నశించింది. డ్యూటీ సమయం ముగిసిందని పైలట్ చెప్పడంతో వారు సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. సోషల్ మీడియా వీడియోల ప్రకారం, కొందరు ప్రయాణికులు "పైలట్ ఎలుకలా ఎందుకు దాక్కుంటున్నాడు?" అని అరవగా, మరొకరు విమానం డోర్‌ను కాలితో తన్నుతూ కనిపించారు. పైలట్‌పై దాడి చేయాలంటూ కొందరు మాట్లాడుకోవడం కూడా కలకలం రేపింది. ఈ ఘటనపై ఇండిగో సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. భద్రతా నిబంధనల ప్రకారం పైలట్ డ్యూటీ సమయం ముగియడంతో విమానం నడపలేదని స్పష్టం చేసింది. వేచి ఉన్న సమయంలో ప్రయాణికులకు ఆహారం, ఇతర సదుపాయాలు అందించామని పేర్కొంది. అయితే, అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరు ప్రయాణికులను విమానం నుంచి దించివేసి భద్రతా సిబ్బందికి అప్పగించినట్లు తెలిపింది. ఈ ప్రక్రియ వల్ల విమానం మరింత ఆలస్యమైంది. చివరికి ఆ విమానం మధ్యాహ్నం 1 గంట సమయంలో క్రాబీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో విచారం వ్యక్తం చేసింది.

# అనంతలో దగ్గుబాటి దండుపాళ్యం బ్యాచ్

**- బందిపోటు ముఠా నాయకుడిగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**- చంద్రబాబు, నారా లోకేష్ ఆశీస్సులతోనే అరాచకాలు**

**- ఖాళీ జాగా కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు..!**

**ప్రభుత్వ కార్యాలయాల్లో యథేచ్ఛగా దందాలు**

**- అనుకూలమైన పోలీసులను నియమించుకుని బెదిరింపులు**

**- సినిమా ఆడాలన్నా.. షోరూంలు ప్రారంభించాలన్నా ఎమ్మెల్యే పర్మిషన్ కావాలా?**

**- లాటరీలో మద్యం షాపులొస్తే మీకు ముడుపులివ్వాలా?**

**- కొత్తగా ఇల్లు కట్టుకోవాలంటే ఎమ్మెల్యే ఆఫీస్‌ను సంప్రదించాలా?**

**- వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ**

**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 16 :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురంలో దండుపాళ్యం బ్యాచ్ తయారైందని, ఈ ముఠాకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. 19 నెలలుగా అనంతపురంలో దాడులు, దౌర్జన్యాలు, కబ్జాల పరంపర కొనసాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ ఆశీస్సులతోనే అరాచకాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ఆయన అనుచరులు చేస్తున్న దందాలను ఆయన వివరించారు. అనంత మాట్లాడుతూ..."అనంతపురం నగరం అంటేనే ప్రశాంతతకు మారుపేరు. చాలా మంది ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగ రిత్యా వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఎవరు అధికారంలో ఉన్నా.. ఏ పార్టీ వాళ్లు వ్యాపారాలు చేసుకున్నా ఇక్కడ ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. కానీ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో భిన్నమైన పరిస్థితి వచ్చింది. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు, ప్రతీకార చర్యలు నిత్యకృత్యమయ్యాయి. దండుపాళ్యం అనే సినిమా తరహాలో ఈ రోజు అనంతపురంలో పరిస్థితి వచ్చింది. అనంతపురం నగరాన్ని అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఠా నాయకుడిగా మారిపోయారు. అరాచక శక్తులు, ఇతర ప్రాంతాల నుంచి బంధువులను తెచ్చి ముఠా ఏర్పాటు చేసి ఆ ముఠాకు నాయకత్వం వహిస్తూ ఆలీబాబా అరడజను దొంగల్లా ప్రవర్తిస్తున్నారు. ఎక్కడైనా ఖాళీ జాగా కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు. ఆ స్థలాలకు కంచెలు వేసి తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎవరైనా అది తమ స్థలం అని వస్తే బెదిరిస్తున్నారు. అధికారం అండతో పోలీసులను కూడా తనకు కావాల్సిన వాళ్లను నియమించుకుని బెదిరిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్లపై లేనిపోని ఆరోపణలు చేయడమే కాకుండా దాడులు చేసేలా దండుపాళ్యం బ్యాచ్ వ్యవహరిస్తోంది. మీరు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి.. మాకు సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ఆశీస్సులు ఉన్నాయని అంటున్నారు. ఎన్నికల్లో వాళ్లకు కోట్లు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నాం. ఇప్పుడు సంపాదించుకోవడానికి కూడా వాళ్ల మద్దతు ఉందంటూ బెదిరించే పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలే కాకుండా తాతముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులను కూడా కబ్జా చేస్తున్నారు. థియేటర్‌లో సినిమా ఆడించాలన్నా.. నగరంలో వ్యాపారం చేసుకోవాలన్నా.. ఏదైనా కొత్త షోరూం ప్రారంభించాలన్నా ఎమ్మెల్యే, ఎమ్మెల్యే ఆఫీస్‌తో పర్మిషన్ తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలో ఇల్లు కట్టుకోవాలన్నా ఎమ్మెల్యే కార్యాలయానికి ముట్టజెప్పాలి. అప్పుడే టౌన్ ప్లానింగ్, కమిషనర్ పర్మిషన్ ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. పోలీస్ స్టేషన్లు, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లినా ముందుగా ఎమ్మెల్యే ఆఫీస్‌కు వెళ్లండని చెబుతున్నారు. గతంలో ఏ పార్టీకి చెందిన వాళ్లు ఇక్కడ అధికారంలో ఉన్నా ఇలాంటి పరిస్థితి లేదు. ఒకప్పుడు ఫ్యాక్షనిస్టులు అనంతపురంలో నివాసం ఏర్పరచుకున్నా ఇంతలా ప్రవర్తించలేదు. గడిచిన 19 నెలలుగా అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. నారాయణపురం పంచాయతీలో బుడగజంగాలకు చెందిన ఐదున్నర ఎకరాలు కబ్జా చేశారు. అయినా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించలేదు. కక్కలపల్లిలో సాక్షాత్తూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భరత్ బంధువులకు చెందిన మూడున్నర ఎకరాలు ఆక్రమించడానికి ప్రయత్నించారు. శారదానగర్‌లోనూ ఇదే పరిస్థితి. కోస్తా ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ కనకదుర్గ ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. రోడ్డు ప్రమాదంలో వాళ్లు చనిపోతే నకిలీ పత్రాలు సృష్టించి ఇంటిని కబ్జా చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దందా జరుగుతోంది. అక్కడ సిబ్బందిపై దౌర్జన్యాలు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదు. తెలుగుదేశం పార్టీకి చెందిన లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న కూడా బాధితురాలే. ఏళ్ల తరబడి ఎగ్జిబిషన్ నడుపుకుంటున్న టీడీపీకే చెందిన ఫక్రుద్దీన్ ముడుపులు ఇవ్వలేదని దౌర్జన్యం చేశారు. మద్యం షాప్‌లో ముడుపులు ఇవ్వలేదని వెంకటరమణ అనే టీడీపీ వ్యక్తికి చెందిన షాప్‌నే తగలబెట్టే పరిస్థితి వచ్చింది. ఇన్ని ఘటనలు జరిగినా ఎస్పీ, డీఎస్పీ, డీఐజీలు ముఠాకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని ప్రశ్నించలేదు. వాళ్ల అనుచరులపై కూడా కేసులు పెట్టలేదు. అందుకే ఎలాంటి భయం లేకుండాపోతోంది. లాడ్జిల్లో గదులు ఇవ్వకపోయినా దౌర్జన్యాలు చేస్తున్నారు. అనంతపురంలోని లాడ్జిల్లో పేకాట, మట్కా యథేచ్ఛగా జరుగుతోంది. చివరకు టీడీపీ వాళ్ల ప్రాణాలకు కూడా రక్షణ లేని పరిస్థితి నెలకొంది.





చంద్రబాబును ఒక్కటే ప్రశ్నిస్తున్నా..! అనంతపురంలో బందిపోట్ల మాదిరిగా ప్రవర్తిస్తుంటే అసలు నీ ప్రభుత్వం ఉందా? నీ ఇంటెలిజెన్స్ ఏమైంది? జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు, మంత్రులు నీకు చెప్పడం లేదా? కలెక్టర్లు, ఎస్పీల మీటింగుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తోలు తీస్తామంటున్నావు..! 19 నెలలుగా ఎమ్మెల్యే, అతడి బంధులు అశోక్, స్వరూప్.. గంగారాం ఇంత చేస్తుంటే ఏం చేస్తున్నావు?

ఎప్పుడో నాలుగైదేళ్ల క్రితం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని నిమిషాల్లో అరెస్ట్ చేస్తున్న పోలీసులకు.. ఎమ్మెల్యే అనుచరులు చిక్కడం లేదంటే వాళ్ల చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది. నిందితులను పోలీసులే పక్కకు పంపారు.! అధికార పార్టీ నేతల దౌర్జన్యాలపై తెలుగుదేశం పార్టీ వాళ్లే ఫిర్యాదులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురంలో అనేక ఘటనలు జరిగాయి. చివరకు రుద్రంపేటకు చెందిన నారాయణరెడ్డి అనే అరటికాయల మండీ వ్యాపారిపై కూడా దాడులు చేశారు. మీ పార్టీ నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్ల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? బందిపోట్లకు నువ్వేమైనా లైసెన్స్ ఇచ్చావా? అందరూ పక్కాగా ప్లాన్ చేసి ఎవరి భూమి అయినా లాక్కుంటారా? జిల్లా కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఉంటే అధికారంలో ఉన్న మిగిలిన పార్టీలు ఏం చేస్తున్నాయి? ఇదే తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో ఉన్నా ఇలాంటి పరిస్థితి లేదు. ఈ రోజు అందరూ భయపడే పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు కొంత మంది మాత్రమే ఫిర్యాదులు చేశారు. ఇకపై ఎవరి భూములు ఆక్రమించినా, వ్యాపారులను బెదిరించినా మాకు చెప్పండి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదు అనంతపురంలో శాంతి, ప్రశాంతత కోరుకునే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు మీకు అండగా ఉంటాయి. పాలేగాళ్లకు ఎవరూ భయపడొద్దు. ఇది పాలేగాళ్ల రాజ్యం కాదు.. తస్మాత్ జాగ్రత్త..! పోలీసులు కూడా అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తొద్దు. దండుపాళ్యం ముఠాలో పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా ఉన్నారు. ఈ బ్యాచ్‌లో 15 మందో.. 20 మందో ఉన్నారు. వాళ్ల లావాదేవీలు చూస్తే అన్నీ బయటకు వస్తాయి. ఈ రోజు అనుచరులను మాత్రమే కాదు.. ముఠా నాయకుడి పేరును కూడా స్వప్న (లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్), ఫక్రుద్దీన్ (ఎగ్జిబిషన్ నిర్వాహకుడు), మద్యం షాప్ యజమాని కూడా చెప్పారు. తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలి" అని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు.

## ధర్మవరం లో మంత్రి సత్య కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు!



**అంకుశం న్యూస్ ధర్మవరం, జనవరి 16:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం రాత్రి ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమం సంప్రదాయ నాట్య ప్రదర్శనలు, తోలుబొమ్మలాట ప్రదర్శనలు, రైతుల జీవితాన్ని ప్రతిబింబించే నృత్యాలతో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరై, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించారు. నాట్య ప్రదర్శనలు, తోలుబొమ్మలాట ప్రదర్శనలను మంత్రి ఆసక్తిగా, తీక్షణంగా వీక్షించారు. మానసా నృత్య కళానికేతన్ వారి ఆధ్వర్యంలో వినాయక సాంగ్, భస్మాసుర నృత్యం, మహిషాసుర మర్ధిని వంటి పలు అద్భుతమైన సంప్రదాయ నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా శ్రీలక్ష్మి చెన్నకేశవ సొసైటీ వారి ఆధ్వర్యంలో భక్తి గీతాలు, సుందరకాండ ఇతివృత్తంతో రూపొందించిన తోలుబొమ్మలాట ప్రదర్శనలు ప్రేక్షకులను ఆధ్యాత్మికంగా అలరించాయి. ఇదే సందర్భంలో చందు డాన్స్ గ్రూప్ వారి ఆధ్వర్యంలో వినాయక సాంగ్‌కు నృత్యం, అలాగే రైతుల జీవితం, వారి కష్టాలను ప్రతిబింబించే పాటకు ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్యాలు ప్రేక్షకుల హృదయాలను తాకగా, మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ఈ ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు.


ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... మన భారతీయ సంప్రదాయ కళలు, నృత్యాలు, తోలుబొమ్మలాట వంటి ప్రజా కళారూపాలు మన సంస్కృతికి ప్రాణం. నేటి యువత ఈ కళలను తెలుసుకుని, నేర్చుకుని, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిదీ. ప్రభుత్వం సంప్రదాయ కళాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుంటుంది, అని అన్నారు. కళాకారుల ప్రతిభను అభినందిస్తూ, నాట్య ప్రదర్శనలు మరియు తోలుబొమ్మలాట ప్రదర్శనలు చేసిన కళాకారులకు మంత్రి సత్య కుమార్ యాదవ్ మొమెంటోలు బహుమతిగా అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

ఈ కార్యక్రమం ద్వారా ధర్మవరం పట్టణంలో సంక్రాంతి పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా, సంప్రదాయ వైభవంతో కళకళలాడింది.

## పండగలో నేర నియంత్రణకు గ్రామ, పట్టణ శివార్లలో డ్రోన్లతో నిఘా

**- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

**అంకుశం న్యూస్ విజయనగరం జనవరి 16:** విజయనగరం జిల్లాలో పండుగ సందర్భంగా నేరాలను నియంత్రించుటకు డ్రోన్లను వినియోగించి, నిఘా ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశాలతో పట్టణాల్లోను, గ్రామ శివార్లలోను నేరాలను నియంత్రించుటకు చర్యలు చేపడుతున్నారన్నారు. రద్దీ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసేందుకు, నేరాలను నియంత్రించుటకు డ్రోన్స్ వినియోగిస్తున్నామన్నారు. డ్రోన్ విజువల్స్ సహకారంతో పట్టణంలో ట్రాఫిక్ రెగ్యులేట్ చేయడంతోపాటు నేరాలను నియంత్రించుటకు, అనుమానస్పద వ్యక్తులపై నిఘా పెట్టేందుకు, రద్దీ ప్రాంతాల్లో డ్రోన్స్ను పంపి, ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై నిఘా ఏర్పాటు చేసేందుకు, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపైన, ఓపెన్ డ్రింకింగు చేసే వారిపైన, కోడి, గొర్రి పందాలు నిర్వహించే వారిపై డ్రోన్స్ను పంపి, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నియంత్రిస్తున్నామన్నారు. నేర నియంత్రణలో సాంకేతికతను, డ్రోన్స్ను వినియోగిస్తూ, నేరాలను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. అదే విధంగా పండగ ముగించుకొని వారి గమ్య స్థానాలకు చేరుకొనే ప్రజలు రహదారి భద్రత నియమాలను పాటిస్తూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరాలని జిల్లా ఎస్పీ సూచించారు.



## ధర్మవరం బేకరీలో భారీ అగ్నిప్రమాదం!

**- సంఘటనా స్థలాన్ని సందర్శించిన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు**





**అంకుశం న్యూస్ ధర్మవరం, జనవరి 16:** ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న ఒక బేకరీలో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బేకరీ పూర్తిగా దగ్ధమై, దాదాపు రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేయబడింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధిత బేకరీ యజమానులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని వివరంగా తెలుసుకున్నారు. అనంతరం ఈ ఘటనను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి దృష్టికి తీసుకువెళ్లినట్లు హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ, బాధితులకు తగిన నష్టపరిహారం అందేలా తక్షణమే అంచనా నివేదిక సిద్ధం చేయాలని, అలాగే సంబంధిత శాఖలు సమన్వయంతో తదుపరి చర్యలను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా వ్యాపార సముదాయాలు, బేకరీలు, హోటళ్లు తదితర వాణిజ్య సంస్థలలో అగ్నిమాపక భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని మంత్రి సూచించినట్లు హరీష్ బాబు తెలిపారు. అవసరమైన చోట అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడం, భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా పరిశీలించడం తప్పనిసరి చేయాలని అధికారులకు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశమని, అయినప్పటికీ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హరీష్ బాబు భరోసా ఇచ్చారు.

## బాపనమ్మ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వస్త్ర, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సత్తి దంపతులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి:** అనపర్తి శ్రీ బాపనమ్మ అమ్మవారి ఆలయం వద్ద బాపనమ్మ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వస్త్రదాన - అన్నదాన కార్యక్రమంలో అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిడి వీర రాఘవ రెడ్డి (వీరయ్య కాపు), కోణాల శ్రీనివాస రెడ్డి (గుంటూరు శ్రీను), టీవీ రామారెడ్డి, కర్రి వెంకటరెడ్డి (ఏడుకొండలు), మల్లిడి సునీల్ రెడ్డి, చింతాశ్రీను తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వీరులమ్మ జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి:** అనపర్తిలో శ్రీ వీరులమ్మ అమ్మ వారి ఆలయంలో సంక్రాంతికి జరిగే వీరులమ్మ జాతర మహోత్సవంలో పాల్గొనిఅమ్మ వారిని దర్శించుకున్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు.



## వైసిపి కార్యకర్త ఇంట్లో సీమంతం పంక్షన్ కి హాజరైన మాజీ ఎమ్మెల్యే కుటుంబసభ్యులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి:** బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో గొలుగూరి వెంకటరెడ్డి, శ్రీమతి వరలక్ష్మి దంపతుల కుమార్తె సీత సుప్రియ సీమంతం వేడుకకు అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు,వారి తనయుడు ప్రముఖ యూరాలజిస్ట్, గౌతమ్ యూరాలజీ & కిడ్నీ సెంటర్ అధినేత డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి,శ్రీమతి ప్రియాంక రెడ్డి దంపతులు హాజరయ్యారు.

## పేదలకు వస్త్ర,అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి:** అనపర్తిలో శ్రీ బాపనమ్మ అమ్మ వారి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా అన్నదానం వృద్దులకు, మహిళలకు వస్త్రాలు అందచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి కుమారుడు గౌరు జనార్దన్ రెడ్డి,అనపర్తి టౌన్ కూటమి నాయకులు,కార్యకర్తలు.



## క్యాలెండర్ పండుగకు విశేష స్పందన

**- ఎంజీ రోడ్డులో సందడే సందడి**

**అంకుశం న్యూస్ విజయవాడ జనవరి 16:** విజయవాడ నగరంలో ఎల్లవేళలా వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు పైలట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్ (ఐఓసీ) సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్యాలెండర్ పండుగకు విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9:00 వరకు దాదాపు 850 మంది వినియోగదారులు తమ తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి ఉత్సాహంగా ఫోటోలు దిగి అనంతరం 2026 కలర్ ఫుల్ క్యాలెండర్ తమ వెంట తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ అధిపతి ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ఈ పండుగను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పండుగకు వినియోగదారులకు ప్రత్యేక ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తున్నామని మేనేజర్ కే వెంకటప్పయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, ఐఓసీ ఎన్టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ డీ సురేష్ కుమార్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు



## తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి దంపతులు

**- కుంకుమార్చన పూజలు చేసిన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి**

**అంకుశం న్యూస్ తిరుపతి జనవరి 16:** రుపతిలోని తిరుచానూరులో వెలసిన శ్రీ పద్మావతి అమ్మవారికి టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన భార్య బైరెడ్డి భారతమ్మ, కూతురు బైరెడ్డి శర్వాణిలు కుటుంబ సమేతంగా శుక్రవారం కుంకుమార్చన, విశేష పూజలు చేసి శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. టీ టీ డి అధికారులు, అర్చకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి కుంకుమ, తీర్థ ప్రసాదం అందజేసి శేష వస్త్రం, పూలమాలతో సన్మానం చేశారు.

